ఈనాడు పెద్దపల్లి

సోమవారం ఆగస్టు 31, 2026

దారి అధ్వానం.. ఆదమరిస్తే ప్రమాదం

ఎలిగేడు నుంచి రాములపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. తారు లేచి, కంకర తేలడంతో పాటు భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారీ



అందులో నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో, ఎంత లోతు ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వారు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఎలిగేడు నుంచి ర్యాకల్‌దేవ్‌పల్లి, రాములపల్లి మీదుగా సుల్తానాబాద్, సుగ్లాంపల్లి, పెద్దపల్లి వెళ్లేందుకు ఈ దారి కీలకం. గోతుల వద్ద హెచ్చరిక బోర్డులు, ప్రమాద సూచికలు లేకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి అనుసంధానమయ్యే ఈ మార్గంలో పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. - **న్యూస్‌టుడే, ఎలిగేడు**

డంపింగ్ యార్డులా వైద్యశాల



మంథని పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాల నివాస గృహాల మధ్య ఉంది. ప్రతి రోజు వైద్యశాలలో ఉపయోగించే వస్తువులు, రోగులు వినియోగించే ప్లాస్టిక్ కవర్లు, ఖాళీ నీళ్ల సీసాలు, ఇంజక్షన్లు, దూది, కొబ్బరి బొండాలు, ఇతర వస్తువులను వైద్యశాల వెనకాల వేయడంతో పెద్ద డంపింగ్ యార్డులా తయారైంది. వైద్యం అందించే ఆసుపత్రిలో రోజుల తరబడి వ్యర్థాలు నిల్వచేయడం ఆందోళన కలిగిస్తోంది. - **న్యూస్‌టుడే, మంథని గ్రామీణం**

జలసిరి.. ప్రగతి జాడేది?

● ఆసక్తి చూపని రైతులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

జిల్లాలో భూగర్భ జలాలు పెంపొందించేందుకు వీబీ జీరాంజీలో ప్రభుత్వం చేపట్టిన జలసిరి ప్రగతి ముందుకు సాగడం లేదు. భూముల్లో పంటలు సాగు చేయడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు.

నెరవేరని లక్ష్యం..

జిల్లాలో 410 పంట కుంటలకు కేవలం 98 చోట్ల గ్రౌండింగ్ చేశారు. బోర్ల రీఛార్జీ 108కి 16, వ్యక్తిగత ఇంకుడుగుంతలు 2 వేలకు 821, సామూహిక ఇంకుడు గుంతలు 437కు గానూ 119 చోట్ల పనులు గ్రౌండింగ్ చేశారు. ఇళ్లలో వ్యక్తిగత, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం అటకెక్కింది. లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇళ్లలో వృథా నీరు రోడ్లపై చేరి దుర్గంధం వెదజల్లడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఎక్కడి నీటిని అక్కడే ఒడిసిపట్టే ప్రయత్నం నెరవేరడం లేదు.

ఔత్సాహిక రైతుల వివరాలు సెర్ప్ అధికారులు సేకరించగా.. ప్రస్తుతం వీరందరూ వెనకాడుతున్నారు. పంట కుంట, బోరు బావుల రీఛార్జీ, ఇంకుడు గుంతల తవ్వకాలపై సందిగ్ధం నెలకొంది. ప్రతి వారం సమీక్షించినప్పటికీ ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదు. వానాకాలం పంట కోతలు ముగిసిన తర్వాత ప్రగతిలో వేగం పెరగనుందని భావిస్తున్నారు.

లోపించిన సమన్వయం..

ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు వృద్ధిలోకి తెచ్చేందుకు ప్రభుత్వం జలసిరి అమలు చేస్తోంది. వీబీ జీరాంజీ సిబ్బంది పొలాల్లో పంట కుంట, బోరు రీఛార్జీ, ఇంకుడు గుంత కోసం లబ్ధిదారులను గుర్తించలేదు. ఈ బాధ్యతను సెర్ప్ అధికారులకు అప్పజెప్పడంతో ఎంత విస్తీర్ణంలో తవ్వకాలు చేయాలనే ప్రచారం కొరవడింది. పంట కాలువలకు కనీసం 2-5 గుంటల్లోపు నిర్మించుకోవచ్చు. అయితే రైతులు ఐదు గుంటల భూమిలో



ఎలిగేడు మండలం శివపల్లిలో పంట కుంటను తవ్వుతున్న కూలీలు

ఏదైనా పంట వేస్తే దిగుబడి వస్తుందని తవ్వకాలు చేసేందుకు మొగ్గు చూపడం లేదు.

సమష్టిగా కదిలితే...

చాలా మంది రైతుల బోర్లు ఎండిపోతున్నాయి. బోరు చుట్టూ రీఛార్జీ గుంత తవ్వితేనే భూగర్భ జలాలు పెరగనున్నాయి. పైసా ఖర్చు లేకుండా కూలీలతో రీఛార్జీ తవ్వకం చేస్తే ఒనగూరే ప్రయోజనాలను రైతులకు వివరించాలి. పంట కుంటను నింపుకొని పంటలు వాడుకోవచ్చు. ఆ దిశగా రైతులను చైతన్యం చేయాలి. అధికారులు సమష్టిగా ముందుకెళితే ఆశయం నెరవేరనుంది.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు: విప్

సుల్తానాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వ విప్ విజయరమణారావు పేర్కొన్నారు. ఆదివారం సుల్తానాబాద్ మండలం కందునూరిపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు 95 శాతం చెల్లింపులు జరిగాయని చెప్పారు. రెండో విడతలో ప్రతి మండలానికి 12 వందల ఇళ్లను కేటాయిస్తామన్నారు. తెలంగాణవాదంతో పదేళ్లు పాలించిన భారాస ప్రభుత్వం ఒక్క పేదవాడికీ ఇల్లు ఇవ్వలేకపోయిందన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చిన ప్రజాప్రభుత్వానికి ప్రజలు భవిష్యత్తులోనూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి శైలజ, నాయకులు రాములు, తిరుపతి పాల్గొన్నారు.



ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాలలో వివరాలు సేకరిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



మంథని జేఎన్టీయూలో బురద దారిలో వస్తున్న అభ్యర్థులు

ప్రశాంతంగా నీట్ పీజీ

పెద్దపల్లి కలెక్టరేట్, కమాన్‌పూర్(సెంటినరీ కాలనీ): జిల్లాలో నీట్-పీజీ 2026 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7.30 గంటల నుంచి 8.45 గంటల్లోపు అభ్యర్థులను క్షుణ్నంగా పరిశీలించారు. పెద్దపల్లి ట్రినిటి, మదర్ థెరిసా, రామగిరి మండలం జేఎన్టీయూ హెచ్‌లో మొత్తం 230 మంది అభ్యర్థులకు 227 మంది హాజరయ్యారు. రామగుండం సీపీ అంబర్‌కిషోర్ ఝా ట్రినిటి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రాన్ని సందర్శించారు. మంథని జేఎన్‌టీయూలో ఏర్పాట్లు సక్రమంగా లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు. వాహనాలను మైదానంలో నిలిపేలా ఏర్పాట్లు చేశారు. అయితే మార్గం బురదమయంగా ఉండటంతో ఇబ్బంది పడ్డారు. 'మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల'అని ఉండటంతో కళాశాల మంథనిలో ఉందని గందరగోళానికి గురయ్యారు.

నడుస్తున్నాయి.. నత్తను తలపిస్తున్నాయి

జిల్లాలో ముందుకు సాగని ఆర్వోబీల నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి

రైల్వే గేటు కష్టాలను తొలగించేందుకు భూసేకరణ ప్రక్రియ ప్రధాన అవరోధంగా మారుతోంది. జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల పరిధిలోని వివిధ లెవల్ క్రాసింగ్ గేట్ల స్థానంలో ఆర్వోబీలు, ఎఫ్‌వోబీల నిర్మాణానికి రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఈ క్రమంలో పెద్దంపేట నుంచి పొత్కపల్లి స్టేషన్ల మధ్య పది వరకు ఎల్సీలను రైల్వేశాఖ త్వరలో మూసివేయనుంది. దీంతో ఆర్వోబీల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ఆర్వోబీ డిజైన్‌ను తయారు చేసిన తరువాత అవసరమయ్యే భూమిని గుర్తించి, సేకరణ ప్రక్రియ చేపట్టాలి. కానీ పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నిర్మాణం మొదలైనా, కూనారం ఆర్వోబీ పనులు కేవలం భూసేకరణ ఆలస్యం కారణంగానే నత్తనడకన సాగుతున్నాయి.



నత్తనడకన సాగుతున్న కూనారం ఆర్వోబీ పనులు

చెల్లింపులతోనే ఆలస్యం..

ప్రజావసరాల కోసం ప్రతిపాదించిన ఆర్వోబీల నిర్మాణానికి అవసరమైన భూమిని సేకరించిన తరువాత పరిహారం చెల్లింపులలో జరుగుతున్న ఆలస్యం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. పెద్దపల్లిలో ప్రస్తుతం నిర్మిస్తున్న కూనారం ఆర్వోబీ నిర్మాణానికి పరిహారం చెల్లింపుల్లో జరుగుతున్న తాత్సారం కారణంగా ఇప్పటికే పలుమార్లు నిర్వాసితులు పనులను అడ్డుకున్నారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. పరిహారం చెల్లించడంతో పాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు, సర్వీసు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.

ఏక కాలంలోనే..

గతంలో ఒకట్రెండు ఆర్వోబీల నిర్మాణం చేసేందుకు రైల్వే శాఖ ప్రయత్నించేది కానీ ఈసారి రైల్వేలైన్‌కు ఇరువైపులా కంచె నిర్మాణంతో పాటు బుల్లెట్ రైళ్లను ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో అన్ని ఎల్సీలకు ఆర్వోబీలను మంజూరు చేసింది. జిల్లాలోని గౌరెడ్డిపేట, కన్నాల, కుందనపల్లి లెవల్‌క్రాసింగ్ గేట్ల వద్ద ఆర్వోబీల నిర్మాణానికి సర్వే పనులు చేపడుతున్నారు. పెద్దంపేట, కన్నాల, అందుగులపల్లి, గొల్లపల్లి, చీకురాయి, కొలనూరు, ఓదెల(2), పొత్కపల్లి(2) ఆర్వోబీలను రైల్వే బోర్డు అనుమతించింది. వీటికి సంబంధించి ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు భూసేకరణ ప్రక్రియ చేపట్టేందుకు అడుగులు వేస్తున్నారు. తాజాగా కుందనపల్లి, కన్నాల, గౌరెడ్డిపేట ఆర్వోబీల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేసేందుకు కలెక్టర్ ఇటీవల సమీక్ష నిర్వహించారు.



జీవనశైలిని మెరుగుపరచుకోవాలి

పరుగులో పాల్గొన్న ఉద్యోగులు

జ్యోతినగర్(మార్కండేయ కాలనీ): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటూ జీవనశైలిని మెరుగుపరచుకోవాలని ఎన్టీపీసీ ఈడీ చందన్‌కుమార్‌సమంత అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పర్మనెంట్‌టౌన్‌షిప్‌లోని ఎంజీ క్రీడా మైదానంలో ఎన్టీపీసీ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మూడు కిలో మీటర్ల పరుగు పందెంను జెండా ఊపి ప్రారంభించారు. ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులు, బాల బాలికలు 226 మంది ఉత్సాహంగా పరుగులో పాల్గొన్నారు. ఎన్టీపీసీ జీఎంలు, అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులు.. ఎరువుల కష్టాలు

న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

అన్నదాతలకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరిపడా వర్షాలు లేకపోవడంతో పాటు సాగు చేస్తున్న పంటలకు ఎరువులు దొరకక అవస్థలు తప్పడం లేదు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎరువుల కొనుగోలుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ(ఎఫ్ఎఫ్ఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చింది. అన్నదాతల పేరుతో భూమి ఉంటేనే యాప్‌లో ఎరువుల నమోదుకు అవకాశం ఉంది. కౌలు రైతులకు ఎరువులు దొరకడం లేదు. కౌలు రైతులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చే అంశం ప్రభుత్వాల ఎన్నికల హామీగానే నిలుస్తోంది. ఎరువుల కొనుగోళ్ల సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు.

☛ పెద్దపల్లి జిల్లాలో 2.78 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో యూరియా, డీఏపీలు కలిపి 34,905 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం.

ఒక్కో రైతుకు 10 నిమిషాలు



మాది గోపాల్‌పూర్ గ్రామం. నేను 2 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. యాప్‌లో యూరియా బుకింగ్ చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. ఒక రైతు యూరియా బుకింగ్ చేసుకోవాలంటే 10 నిమిషాలు పడుతోంది. కౌలు రైతు కావడంతో యూరియా సకాలంలో లభించడం లేదు.
- **పప్పుల లక్ష్మణ్, గోపాల్‌పూర్**

యాప్‌లో బుక్ కావడం లేదు



మాది స్వర్ణపల్లి గ్రామం. నేను 5 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాను. సమయానికి యూరియా దొరకడం లేదు. కౌలు రైతును కావడంతో యాప్‌లో బుకింగ్ కావడం లేదు. పంటలకు సకాలంలో ఎరువులు అందించకపోతే నష్టపోవాల్సి వస్తుంది. - **పొట్ల మల్లయ్య, స్వర్ణపల్లి**

దుకాణాల చుట్టూ తిరుగుతున్నా..



మాది నాగారం గ్రామం. కౌలుకు తీసుకొని 5 ఎకరాల్లో పొలం, 2 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను. నాకు 10 బస్తాల యూరియా అవసరం ఉంది. వారం రోజులుగా దుకాణాల చుట్టూ తిరుగుతున్నాను. యాప్‌లు పని చేయడం లేదు. మా భూములకు సంబంధించి యజమానులకే ఓటీపీ వెళ్తుంది. - **పర్వేణ శ్రవణ్, నాగారం**

న్యూస్‌టుడే, ధర్మపురి : గోదావరి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు స్పష్టం చేశారు. ఇటీవల ధర్మపురిలోని దేవాలయ కార్యాలయంలో 'న్యూస్‌టుడే'తో ఆయన పుష్కరాల పనులపై మాట్లాడారు.

రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

సెప్టెంబరులో ముమ్మరంగా పుష్కర పనులు



ప్రశ్న: పుష్కరాలకు సంబంధించి నిధులు, పనుల పరిస్థితేమిటి.

సమాధానం : గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో అనుమతులు వచ్చాయి. ధర్మపురి, భద్రాచలం, బాసర వంటి పుణ్యక్షేత్రాలతో పాటు, గోదావరి తీర ఆలయాల వద్ద మౌలిక వసతుల కల్పనకు రూ.1000 కోట్లు మంజూరయ్యాయి. సెప్టెంబరు మొదటి వారంలో అన్ని పుష్కరక్షేత్రాల్లో పనులు ముమ్మరంగా చేపడతాం. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి.

ప్ర : ఆలయాల వారీగా కేటాయించిన నిధులు

స: ధర్మపురి, కోటిలింగాలకు రూ.117 కోట్లు కేటాయించారు. వీటిలో దేవాదాయశాఖ ద్వారా మంజూరైనా రూ.10 కోట్లతో ఉగ్ర స్వామి ఆలయం జీర్ణోద్ధరణ పనులు చేపడుతున్నాం. రెండో విడతలో ఇరిగేషన్ ఆధ్వర్యంలో పుష్కరఘాట్లు, ఆర్‌అండుబీ శాఖ ద్వారా రహదారులు, బైపాస్‌రోడ్లు నిర్మించనున్నాం. గత పుష్కరాల సందర్భంగా ధర్మపురికి 50 లక్షలకు పైగా హాజరు కాగా.. ఇప్పుడు కోటికి పైగానే హాజరవుతారని భావిస్తూ ఏర్పాట్లు చేపడుతున్నాం. మొదటి విడతలో రూ.100 కోట్లు విడుదల కాగా.. తీర ప్రాంత, ఆలయాల అభివృద్ధికి ఉపయోగిస్తాం.

ప్ర : ఘాట్ల వద్ద తొక్కిసలాట, ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

స : ఏఐ ఆధారిత సీసీటీవీలతో రద్దీని ఎప్పటికప్పుడు లెక్కిస్తూ గరిష్ఠ పరిమితి మించకుండా విడతల వారీగా స్నానాలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. బైపాస్ రహదార్ల నిర్మాణంతో ఒకవైపు నుంచి భక్తులు లోనికి రావడం, మరో రోడ్డు నుంచి వెళ్లిపోవడం జరుగుతుంది. ఇలా శాస్త్రీయ దృక్పథంతో సర్వే చేయించి చర్యలు తీసుకుంటాం.

ప్ర: నదీ జలాలు కలుషితం కాకుండా ఏం చేస్తారు.

స : యువకులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లతో ఎప్పటికప్పుడు నీటిశుద్ధి వ్యవస్థలపై సర్వే చేయిస్తూ పారిశుద్ధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నిరంతరం శుభ్రంగా ఉంచేలా, చెత్త రహిత కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నాం. ప్రైవేట్ సంస్థలతో ఇప్పటికే దీనిపై ప్రధాన క్షేత్రాల్లో సర్వే చేపట్టాం. నది కలుషితం కాకుండా మైకుల ద్వారా భక్తులను చైతన్యం చేస్తాం.

ప్ర : డిజిటల్ టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించనున్నారు.

స : ప్రత్యేక పుష్కర మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం. దీని ద్వారా ఘాట్ల వద్ద రద్దీ, తాజా పరిస్థితి, పార్కింగ్ స్థలాలు, సమీప క్యాంపులు, వసతి గృహాల లభ్యత, పూజ సమయాల సమాచారాన్ని నేరుగా ప్రజలు తెలుసుకునేలా చర్యలు తీసుకుంటాం. యాప్‌కు ఇంకా తుది రూపం రాలేదు.



మంథని బస్టాండ్‌లో ప్రయాణికులు

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

మంథని, న్యూస్‌టుడే: మంథని బస్టాండ్‌లో ఆదివారం బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వచ్చిన బస్సుల్లో రద్దీ అధికంగా ఉండటంతో నిరీక్షణ తప్పలేదు. కరీంనగర్‌కు వెళ్లే మంథని డిపో బస్సు శ్రీరాంనగర్ సమీపంలో మరమ్మతుకు గురికాగా అక్కడ వేరే బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకే సారి మూడు బస్సులు రావడంతో సీట్ల కోసం పోటీపడ్డారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు బస్సులు రాలేదు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో రాత్రి 7.30 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు హైదరాబాద్‌కు అదనంగా ఏడు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, రెగ్యులర్ బస్సులు నడుస్తాయని డీఎం శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మండల స్థాయి ఆటల పోటీలు

ధర్మారం: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1, 3 తేదీలలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. నందిమేడారంలోని బాలుర గురుకులంలో నిర్వహించే ఈ పోటీలు అండర్-14, అండర్-17 విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. 1న బాలురకు, 3న బాలికలకు ఉంటాయన్నారు.

పండగ గిరాఖీ

☛ కిక్కిరిసిన బస్టాండ్ ☛ నేడూ రద్దీ కొనసాగే అవకాశం



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

న్యూస్‌టుడే, కరీంనగర్ రవాణా విభాగం

రక్షాబంధన్‌కు వచ్చినవారు స్వస్థలాలకు బయల్దేరడంతో ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్‌స్టాండ్ ఆవరణలో ఎక్కడ చూసినా జనమే కనిపించారు. ప్లాట్‌ఫాంలు వదిలి ప్రయాణికులు ఇన్‌గేట్, కరీంనగర్-1, 2 డిపోల ముందు బస్సుల కోసం పడిగాపులు కాశారు. బస్సులురాగానే పరుగులు తీయగా సెక్యూరిటీ సిబ్బంది బస్సుల వద్ద ఉంటూ నేరుగా ప్లాట్‌ఫాంల పైకి వెళ్లేలా చూశారు.

అదనపు సర్వీసులు

జేబీఎస్ రూట్లో నిత్యం 330 బస్సులు తిరుగుతుండగా 120 సర్వీసుల్లో ముందస్తు సీట్ రిజర్వేషన్లు చేసుకునే వీలుండేది. రద్దీ దృష్ట్యా జేబీఎస్‌కు అదనంగా 200 బస్సులు నడపగా అందులో 180 సర్వీసుల్లో రిజర్వేషన్ వెసులుబాటు కల్పించారు. వీటితోపాటు అదనంగా మరో 40 సిటీ బస్సులను తెప్పించినట్లు ఆర్‌ఎం రాజు తెలిపారు. ఆర్‌ఎంతోపాటు కరీంనగర్ జోన్ సెక్యూరిటీ అధికారి భావ్‌రావు బస్టాండ్‌లో మకాం వేసి పరిస్థితిని పరిశీలించారు.

ముందస్తు రిజర్వేషన్

ప్రయాణికుల రద్దీ సోమవారం కొనసాగే అవకాశం ఉంది. దీంతో అధికారులు అదనపు సర్వీసులు తిప్పడం, అవసరమైతే సిటీ బస్సులు తెప్పించడం వంటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాన్ రిజర్వేషన్ బస్సులతోపాటు ముందస్తు టికెట్ రిజర్వేషన్ కోసం అదనపు బస్సులను అందుబాటులో ఉంచుతున్నారు. అవకాశం ఉన్న ప్రయాణికులు ముందస్తు టికెట్ రిజర్వేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.



డిపోలోకి చొచ్చుకెళ్లగా..

రెండో డిపోలో ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా కొందరు ప్రయాణికులు డిపోలోకి చొచ్చుకు వెళ్లి బస్సు ఎక్కడానికి ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. జేబీఎస్, కామారెడ్డి, వరంగల్, హనుమకొండ, గోదావరిఖని, జగిత్యాల, ఆదిలాబాద్, మంచిర్యాల రూట్లలో తీవ్రమైన రద్దీ నెలకొంది. పలు రూట్లలో సరిపడా బస్సులు లేక ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పలేదు.

చేతుల శుభ్రత.. ఆరోగ్య భద్రత

పిల్లలకు అలవాటుగా మారితే వ్యాధులు దూరం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి

వర్షాకాలంలో పిల్లలు సీజనల్, అంటువ్యాధుల బారిన పడుతుంటారు. వ్యక్తిగత శుభ్రత పాటించడంతో పాటు చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దరి చేరకుండా ఉంటాయి. చేతులను శుభ్రంగా ఉంచుకుంటే పలు రకాల వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. తీసుకునే ఆహారం, తాగే నీరు వేడిగా, శుద్ధిగా ఉంటే ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో అవగాహన

చిన్నారులు ఆరుబయట మట్టి, ఇసుకలో ఆటలాడి చేతులను శుభ్రం చేసుకోకపోవడం తదితర కారణాలతో వ్యాధులు ప్రబలే ప్రమాదముంది.



మెట్‌పల్లి బడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సింగ్ అధికారి

అపరిశుభ్ర చేతులతో భోజనం తినడం వల్ల హానికర సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్లు, విరేచనాలు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ఉమ్మడి జిల్లాలో చాలా పాఠశాలల్లో చేతుల శుభ్రతపై విద్యార్థులకు వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. ఇది అలవాటు చేసుకుంటే జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్లు రావు. శరీరంలోకి బ్యాక్టీరియాలు చేరకుండా ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- చేతుల శుభ్రతతో డయేరియా, కలరా, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అరికట్టవచ్చు.
- మట్టిలో ఆడి, మలవిసర్జన తర్వాత చేతులు సరిగ్గా శుభ్రం చేసుకోక ఆహారం తీసుకుంటే కడుపులో నులి పురుగులు తయారై రక్తహీనతకు దారి తీస్తోంది. తద్వారా రోగనిరోధకశక్తి తగ్గి త్వరగా వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.
- పిల్లలు చేతిగోళ్లను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలి. గోళ్లలో మట్టి చేరకుండా ఉంటుంది.
- పెంపుడు జంతువులను, దుమ్ము, ధూళి ఉన్న వస్తువులను తాకిన తర్వాత, ఆహారం తినడానికి ముందు, మల, మూత్ర విసర్జన తర్వాత సబ్బు ఉపయోగించాలి.

ఉమ్మడి జిల్లాలో బడికి వెళ్లే పిల్లల వివరాలు ఇలా..

జిల్లా	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్న సిరిసిల్ల
పాఠశాలలు	850	692	579	533
విద్యార్థులు	57,946	37,814	29,171	39,161

తల్లిదండ్రులు నేర్పించాలి



శుభ్రత లోపంతో పిల్లలకు అనేక వ్యాధులు వస్తాయి. తల్లిదండ్రులు చేతులను శుభ్రంగా కడుక్కోవడాన్ని పిల్లలకు నేర్పించాలి. పిల్లల చేతి గోళ్లలో తరచూ మట్టి చేరడం గమనిస్తుంటాం. దీంతో కడుపులో ఇన్ఫెక్షన్లు, నులి పురుగుల సమస్యలు వస్తాయి.

-డా.రాజేశ్వర్, పిల్లల వైద్య నిపుణులు, మెట్‌పల్లి సీహెచ్‌సీ



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

మన్‌కీబాత్ వీక్షించిన హోంశాఖ సహాయ మంత్రి

తెలంగాణచౌక్(కరీంనగర్) : ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన 137వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తన నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు. మన్‌కీబాత్ ద్వారా మోదీ వివిధ అంశాలపై తన అభిప్రాయాలు వివరిస్తుంటారన్నారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, భాజపా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనానికి ప్రత్యేక నిధులు

న్యూస్‌టుడే, వెల్గటూరు

పాఠశాలల్లో సంగ్రహణాత్మక మూల్యాంకనం విధానంలో ఎస్‌ఏ- 1, 2 పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ పలు మార్పులు తీసుకొచ్చింది. మూల్యాంకన వ్యవస్థ విశ్వసనీయతను బలోపేతం చేసేందుకు జవాబు పత్రాల మూల్యాంకనంలో నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనం, కచ్చితత్వాన్ని పెంపొందించేలా బాహ్య మూల్యాంకన విధానాన్ని ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమలు పరిచేందుకు మార్గదర్శకాలు జారీ చేశారు. దీని కోసం జిల్లాల వారీగా ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించారు.

☛ మండల స్థాయిలో శిబిరం నిర్వహణకు ఏక మొత్తంలో రూ.10వేలు కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో ఒక్కో జవాబు పత్రానికి రూ.2, హైస్కూల్ స్థాయిలో రూ.3 పారితోషికాన్ని చెల్లిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.50.49లక్షలు కేటాయించారు.

ఉమ్మడి జిల్లా గణాంకాలు:

జిల్లా	మండలాలు	పాఠశాలలు	విద్యార్థులు	నిధులు(రూ.లలో)
జగిత్యాల	20	770	47,532	17,32,040
కరీంనగర్	16	631	32,209	12,21,138
పెద్దపల్లి	14	530	24,637	9,61,322
రాజన్న సిరిసిల్ల	13	486	32,376	11,35,062

డిప్యూటీ రేంజ్ అధికారి సస్పెన్షన్

మల్లాపూర్: జగిత్యాల అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి మహేశ్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ అర్పణ ఉత్తర్వులను జారీ చేశారు. ఒబులాపూర్ దాబాలో అటవీ అధికారుల విందుపై సమగ్ర విచారణ చేపట్టగా.. దీనికి కారకుడైన మహేశ్‌గౌడ్‌ను సస్పెన్షన్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉండి పట్టపగలే మందుతో విందు చేసుకున్న సంఘటనలో మరో అయిదుగురు ఉద్యోగులకు ఇప్పటికే మెమోలు జారీ చేసిన విషయం తెలిసిందే. విచారణ పూర్తిస్థాయిలో జరిగితే మరింతమంది అధికారులపై వేటు పడే అవకాశం ఉంది.

దూరవిద్యలో ప్రవేశాలకు పది రోజులే గడువు

కరీంనగర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ దూర విద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉందని కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్ తెలిపారు. 'ఈనాడు' 'ఫోన్-ఇన్'లో పాఠకుల ప్రశ్నలకు ఆయన జవాబులిచ్చారు. ప్రవేశాలు, పరీక్షలు, కొత్త కోర్సులపై లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు.

ఫోన్-ఇన్



☛ కరీంనగర్ స్టడీ సెంటర్ సమన్వయకర్త సత్యప్రకాశ్

? 2024లో ఎంఏ తెలుగులో ప్రవేశం తీసుకున్నా. పరీక్షలకు హాజరు కాలేదు. ఇప్పుడు రాయొచ్చా **-హరిప్రసాద్, మంచిర్యాల**
✔ సంవత్సరం వారీగా రాసుకోవచ్చు. సెప్టెంబరులో ప్రథమ సంవత్సరం, అనంతరం రెండు, మూడో సంవత్సరాల పరీక్షలు రాయాల్సి ఉంటుంది.

? ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ కోర్సు చేయొచ్చా **-సందీప్‌కుమార్, గోదావరిఖని**
✔ ఆరు నెలల సర్టిఫికెట్ కోర్సు అందుబాటులో ఉంది. రూ.1600 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

? నేను జీఎన్ఎం చేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నా. ఇప్పుడు ఓపెన్ డిగ్రీ చేయొచ్చా **-రవీందర్, వరంగల్**
✔ డిగ్రీ చేసుకోవచ్చు.

? ఓపెన్ యూనివర్సిటీలో జాయిన్ అయి జగిత్యాల సెంటర్‌లో డిగ్రీ చేయొచ్చా **-చందు, జగిత్యాల**
✔ జగిత్యాల సెంటర్‌ను ఎంపిక చేసుకోండి.

? 2024లో పీజీలో నమోదు చేసుకున్నా. కొన్ని పరీక్షలు రాయలేదు. ప్రస్తుతం మరోసారి మరో సబ్జెక్టుతో అడ్మిషన్ తీసుకోవచ్చా **-రాజు, వేములవాడ**
✔ తీసుకోవచ్చు.

? మా అమ్మాయి కరీంనగర్ అధ్యయన కేంద్రంలో బీఎస్సీ ఓపెన్ డిగ్రీ చేస్తోంది. ఇక్కడే ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలా? లేదా మంచిర్యాలకు మార్చుకోవచ్చా **-టి.గోపాల్, జన్నారం, మంచిర్యాల జిల్లా**
✔ ప్రాక్టికల్ తరగతులకు హాజరు కావాలి. స్టడీ సెంటర్‌ను కరీంనగర్ నుంచి మంచిర్యాలకు మార్చుకునేందుకు హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి.

? ఓపెన్ వర్సిటీలో పదేళ్ల కిందట అడ్మిషన్ తీసుకున్నాను. పరీక్షలు రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా **-బత్తుల లక్ష్మీనారాయణ, చొప్పదండి**
✔ సెప్టెంబరు 9 వరకు అవకాశం ఉంది. హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి తీసుకొని రండి.

? పీజీలో ఈ ఏడాది కొత్త కోర్సులు ఏమైనా ప్రవేశపెట్టారా **-ఎన్.పద్మావతి, కరీంనగర్**
✔ ఈ ఏడాది ఎం.ఈడీ రెండేళ్ల కోర్సుతో పాటు, ఎంఎస్‌డబ్ల్యూ రెండేళ్ల కోర్సులు అందుబాటులోకి వచ్చాయి.

? 1995-96లో డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాశాను. రెండో సంవత్సరం రాయలేదు. ఇప్పుడు రాయొచ్చా **-శ్యామల, కరీంనగర్**
✔ హైదరాబాద్ ప్రధాన కార్యాలయం నుంచి అనుమతి పొంది రీ అడ్మిషన్ తీసుకోవాలి.

కూరగాయల నర్సరీ.. అనుమతి తప్పనిసరి

మీ కోసం

న్యూస్‌టుడే, మానకొండూర్

కూరగాయల సాగుకు రైతులకు నారు అవసరం కావడంతో నర్సరీలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. అయితే నర్సరీల నిర్వహణకు అనుమతులు పొందడం తప్పనిసరి అని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారులు సూచిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

☛ నర్సరీ ఏర్పాటుకు ఉద్యాన విస్తరణ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారం తీసుకోవాలి. ☛ భారతీయ స్టేట్ బ్యాంకులో నిర్ణీత రుసుం చలానా రూపంలో చెల్లించి రసీదు పొందాలి. ఇందులో ఎకరానికి రూ.2500 చెల్లించాల్సి ఉంటుంది.

☛ పూర్తి చేసిన దరఖాస్తు పత్రానికి బ్యాంకులో చెల్లించిన చలానా రసీదును జత చేసి.. దరఖాస్తును స్థానిక ఉద్యాన విస్తరణ అధికారికి లేదా జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సమర్పించాలి

కావాల్సిన పత్రాలు
★ పట్టాదారు పాస్ పుస్తకం ★ రైతు, కౌలు రైతు ఆధార్ కార్డు ★ మట్టి, నీటి పరీక్ష నివేదికలు ★ రైతు ఒప్పంద పత్రం ★ గ్రామ పంచాయతీ ఆమోద పత్రం ★ నర్సరీ యజమాని ఆధార్

మిల్లులో 300 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వలు

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలున్నాయనే సమాచారంతో హుజూరాబాద్ మండలం రాంపూర్‌లోని తిరుమల ఇండస్ట్రీస్‌లో ఆదివారం సివిల్ సప్లై, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేపట్టారు. మిల్లులో రేషన్ బియ్యం నిల్వలను గుర్తించారు. అదే సమయంలో మరో రెండు ట్రాలీ ఆటోల్లో రేషన్ బియ్యం రావటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకొని. ఎక్కడి నుంచి వచ్చాయనే వివరాలపై ఆరా తీస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రేషన్ దుకాణంలో నుంచి కొంత సేకరించినట్లు సమాచారం. మిల్లులో బియ్యం నిల్వలు సుమారు 300 క్వింటాళ్ల వరకు ఉన్నాయన్నారు. ఈ మేరకు మిల్లు యజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సివిల్ సప్లై శాఖ అధికారులు చెప్పారు. మిల్లును సైతం సీజ్ చేయనున్నట్లు వెల్లడించారు. డీటీసీఎస్ విజయ్‌కుమార్, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్లు వినోద్‌కుమార్, ఎండీ.అన్వరుల్లా ఖాన్, టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మిల్లులో బియ్యం లెక్కలు వేస్తున్న సివిల్ సప్లై అధికారులు



జెండాపై కవిరాజు పుస్తకావిష్కరణలో మేయర్ శ్రీనివాస్, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కవులు, పరిషత్ ప్రతినిధులు

దేశభక్తి కావ్యంగా 108 మంది కవుల సంపుటి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: జెండాపై కవిరాజు సంపుటి 108 మంది తెలుగు రాష్ట్రాల కవుల కవిత్వంతో దేశభక్తి కావ్యంగా నిలుస్తుందని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ భగవతి పాఠశాల వేదికగా ఆదివారం జాతీయ సాహిత్య పరిషత్ జిల్లాశాఖ రూపొందించిన సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిప్యూటీ మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ సమాజంలో జాతీయవాద ఆలోచనలను రేకెత్తిస్తూ కవులు అక్షరాన్ని ఆయుధంగా మలచారని పేర్కొన్నారు. అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జాతీయ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ యువతలో దేశీయ భావజాలాన్ని నూరిపోసేలా కవులు కృషి చేయాలన్నారు. పరిషత్ తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయులు, కవి, అవధాని డా.గంగ్ర లక్ష్మణ్‌రావు, భగవతి విద్యాసంస్థల ఛైర్మన్ రమణారావు, పరిషత్ జిల్లా అధ్యక్షుడు గాజుల రవీందర్, ఆర్ఎస్ఎస్ బౌద్ధిక్ ప్రముఖ్ సామల కిరణ్‌లు, నంది శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాలో తన పాట ఉపయోగించారని ఫిర్యాదు



రెండో ఠాణా సీఐకి ఫిర్యాదు చేస్తున్న గాయకురాలు తేలు విజయ, తెలంగాణ రక్షణ సేన నాయకులు

కరీంనగర్ సాంస్కృతికం, నేరవార్తలు న్యూస్‌టుడే: సొంతంగా రచించి, పాడిన 'పున్నామ పున్నామ' పాటను తన అనుమతి లేకుండా జాంబిరెడ్డి-2 సినిమాలో ఉపయోగించారని తెలంగాణ ఉద్యమ గాయకురాలు తేలు విజయ ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తేలు విజయ వివరాలను పత్రికాముఖంగా వెల్లడించారు. తాను ఎంతో కష్టపడి రూపొందించుకున్న పున్నామ పాటను తన అనుమతి లేకుండా సినిమాలో ఉపయోగించి తన హక్కులు, మనోభావాలకు భంగం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా నిర్మాతపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి లింగంపల్లి నాగరాజు, నాయకులు రంగరవేణి లక్ష్మణ్, కుతాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు ప్రణాళిక

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: అల్గునూరులోని వెల్చాల జగపతి రావు(వీజేఆర్) మెమోరియల్ క్రికెట్ మైదానం, అకాడమీని ఆదివారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) బాధ్యులు సందర్శించారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ(సీఓసీ) అధిపతి అంబటి రాయుడు, జిల్లా క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్, మాజీ హెచ్‌సీఏ కార్యదర్శి టి.శేషనారాయణ్, హెచ్‌సీఏ మహిళా క్రికెట్ అభివృద్ధి విభాగం అధిపతి సునీతా ఆనంద్‌లతో కూడిన బృందంరాగా కేడీసీఏ అధ్యక్షుడు వి.ఆగంరావు స్వాగతం పలికారు. వీజేఆర్ మెమోరియల్ క్రికెట్ మైదానం అభివృద్ధి, అందుబాటులోని మౌలిక సదుపాయాలు, టర్ఫ్ వికెట్లు, ప్రాక్టీస్ నెట్స్ గురించి వివరించారు. బీసీసీఐ స్థాయి టోర్నమెంట్లతో పాటు టీజీ-20 లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు అనువైన ప్రమాణాలతో మైదానం ఉందని రాయుడు అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ లీగ్ మ్యాచ్‌లను కరీంనగర్‌లో నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. శేషనారాయణ్ మాట్లాడుతూ కరీంనగర్‌లో ఉన్నత ప్రమాణాలతో కూడిన క్రికెట్ అకాడమీని త్వరలో ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు హెచ్‌సీఏ అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అంబటి రాయుడు చిత్రంలో హెచ్‌సీఏ బాధ్యులు

అండర్-16 బాలురు, మహిళా క్రికెటర్లతో ముచ్చట్లు

హెచ్‌సీఏ నిర్వహించిన మహిళల ఓపెన్ సెలెక్షన్స్ ట్రయల్స్‌కు హాజరైన 40 మంది మహిళా క్రికెటర్లు, కేడీసీఏ అండర్-16 బాలురతో అంబటి రాయుడు ముచ్చటించారు. జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులు అందుబాటులోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సునీత ఆనంద్ మహిళా క్రికెటర్లతో మాట్లాడి వారి శిక్షణ, అభివృద్ధికి సంబంధించిన అంశాలను తెలుసుకున్నారు. ప్రతిపాదిత హెచ్‌సీఏ అకాడమీ ద్వారా కరీంనగర్‌తోపాటు ఉత్తర తెలంగాణలోని పరిసర జిల్లాలకు చెందిన బాలురు, బాలికలు, పురుషులు, మహిళా క్రికెటర్లకు కోచింగ్, మెరుగైన శిక్షణ, ఉన్నతస్థాయి క్రికెటర్లుగా ఎదిగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. హెచ్‌సీఏ సభ్యులు చెకూరి వెంకటేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, టీజీ20 హెడ్ క్రికెట్ ఆపరేషన్స్ భరణి, హెచ్‌సీఏకు చెందిన నిశాంత్‌రావులు పాల్గొన్నారు.

స్వేరోస్ అంటే ఆలోచన, ఆచరణ



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

గంగాధర, న్యూస్‌టుడే: కులం, మత, ప్రాంతం, రాజకీయం, పురుష, మహిళలని కాకుండా ఆలోచన, ఆచరణ, అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వేరోస్ ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గంగాధరలో ఆదివారం స్వేరోస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞాన సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం మాట్లాడారు. సామాజిక మాధ్యమాలకు బానిసలై నేడు ఎందరో విద్యార్థులు, యువత నేర ప్రవృత్తిలోకి దిగుతున్నారని అన్నారు. నల్గొండ జిల్లాలో పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డిని పదో తరగతి విద్యార్థులు హత్య చేయడం బాధించిందన్నారు. స్వేరో అంటే కఠినమైన క్రమశిక్షణ, ప్రేరణ అని చెప్పారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటలకు స్వేరో గీతం ఆలపించి ధ్యానం చేయాలన్నారు. స్ఫూర్తినిచ్చే వారిని స్మరించుకోవాలన్నారు. ఉదయం నిర్వహించిన 5 కే పరుగు పందెంలో రాణించిన ముగ్గురికి ప్రోత్సాహకాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, స్వేరోస్ ప్రతినిధులు కొంకటి శేఖర్, దాసరి ఉష, నాగి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భాజపా నాయకులను ఎందుకు రాజీనామా కోరలేదు

బాలికపై అత్యాచారం కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై పార్టీపరంగా భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. గంగాధరలో మీడియాతో మాట్లాడారు. భాజపా నాయకులను వెనకేసుకుంటూ భారాసపై అభాండాలు వేస్తున్నారన్నారు. ఎంఐఎం ఎమ్మెల్సీపై వచ్చిన ఆరోపణలకు ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చర్యలు తీసుకున్నారని చెప్పారు. భాజపా అధికార ప్రతినిధి సంగప్పపై ఆరోపణలు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

ఆటోను ఢీకొన్న కోళ్ల వ్యాన్

కూలీ మృతి, పలువురికి గాయాలు



లింగాల దేవమ్మ

గంగాధర, న్యూస్‌టుడే: కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి గంగాధర ప్రధాన కూడలిలో ఆదివారం కోళ్ల మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో కూలీలతో వెళ్తున్న ఆటో ట్రాలీ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు గంగాధర మండలం మంగపేటకు చెందిన 9 మంది మహిళా కూలీలు ట్రాలీ ఆటోలో బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. ఇదే సమయంలో జగిత్యాల వైపు నుంచి కోళ్ల మినీ వ్యాన్ చోదకుడు పవన్ అతివేగంగా ముందుకు వెళ్లే క్రమంలో ఆటోను ఢీకొట్టగా బోల్తాపడింది. తీవ్రంగా గాయపడ్డ లింగాల దేవమ్మ(59)తోపాటు చొప్పదండి శైలజ, నాగెల్లి రాధ, అతికం మమత, సరోజన, ఆటో చోదకుడు చారీని కరీంనగర్‌లోని ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ దేవమ్మ మృతి చెందారు. క్షతగాత్రులకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. బాధితులను కరీంనగర్‌లోని ఆసుపత్రిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించాలని సీఎంవో కార్యాలయానికి ఫోన్ చేసి విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌కు ఫోన్‌లో సూచించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గాయపడ్డ వారిని గంగాధరలో పరామర్శించారు. మృతురాలు దేవమ్మ భర్త దుర్గయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.



ప్రమాదంలో గాయపడ్డ మహిళలు

సంవత్సరీకం చేయడానికి వచ్చి.. చెరువులోపడి

ప్రమాదవశాత్తు ఒకరి మృత్యువాత



మురళి

గంగాధర, న్యూస్‌టుడే: గంగాధర మండలం బూర్గుపల్లిలో ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు ఆడెపు మురళి(47) భీవండిలో చేనేత పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మురళి తల్లిదండ్రుల మృతితో సంవత్సరీకం చేయడానికి కుటుంబీకులతో కలిసి వచ్చారు. మురళి బూర్గుపల్లిలోని చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి నీటిలో మునిగి ఈత రాక మృతి చెందాడు. భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

అపూర్వసమ్మేళనం.. ఆత్మీయ సంబరం


పూర్వ విద్యార్థి అలీ రాసిన పుస్తకాన్ని విడుదల చేస్తున్న విప్ విజయరమణారావు

సుల్తానాబాద్ (గ్రామీణం, న్యూస్‌టుడే: సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన 1973-74 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం కనువిందుగా జరిగింది. 52 ఏళ్ల తరువాత ఒకే వేదికపై కలిసి ఉత్సాహంగా గడిపారు. ఆరు పదుల వయసులో ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ విజయరమణారావు ముఖ్యఅతిథిగా హాజరై మహమ్మద్ అలీ అనే పూర్వ విద్యార్థి రాసిన 'ది సోయిల్ రిమెంబర్స్ ఎవ్రీ థింగ్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తమకు గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆయిల రమేశ్, శివకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యాంకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


యైటింక్లయిన్‌కాలనీలో..

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: కాలనీలోని సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో 1990లో పదో తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కాలనీలోని పాఠశాల ఆవరణలో అపూర్వ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం


పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏసీపీ కృష్ణ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఏసీపీ జి.కృష్ణ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేసుల నమోదు విధానం, సిబ్బంది హాజరు వివరాలు, సీసీటీవీ పర్యవేక్షణను పరిశీలించారు. పెండింగ్ కేసుల పురోగతిని తెలుసుకొని, విచారణ వేగవంతం చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, నేర నియంత్రణకు గస్తీని బలోపేతం చేయాలని సిబ్బందికి సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐ రంజితరావు, ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల యాదవ సంఘం కమిటీ ఎన్నిక


మండల కమిటీ బాధ్యులు, సంఘం నాయకులు

ఓదెల, న్యూస్‌టుడే: ఓదెల మండలకేంద్రంలో ఆదివారం అఖిల భారత యాదవ మహాసభ నేతల పర్యవేక్షణలో ఆదివారం యాదవ సంఘం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేల్పుల ఐలయ్య, ఉపాధ్యక్షులుగా బండారి శ్రీనివాస్, పోలం మల్లయ్య, కుమారస్వామి, మొగ్గల వెంకటేష్, చిన్న ఓదెలు, ఒజ్జ శ్రీనివాస్, కార్యదర్శులుగా వెంకటేష్, తిరుపతి, సమ్మయ్య, సహాయ కార్యదర్శులుగా రాజు, ఐలయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు గంట రాములు, మేకల మల్లేశం, సందనవేన రాజేందర్ పాల్గొన్నారు.

రీసైక్లింగ్‌కు అనుకూలంగా వేరు చేయాలి


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్టీపీసీ ఈఎంజీ విభాగం మేనేజర్లు

జ్యోతినగర్(రామగుండం కార్పొరేషన్): తడిపొడి వ్యర్థాలను రీసైక్లింగ్‌కు అనుకూలంగా వేరుచేయాలని ఎన్టీపీసీ ఈఎంజీ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లోని వ్యాపార సముదాయం సమీపంలో కార్మికులు, స్థానికులకు, వ్యాపారులకు వ్యర్థాల సేకరణపై అవగాహన కల్పించారు. టౌన్‌షిప్ పరిధిలోని ప్రతి ఒక్కరూ అంకిత భావంతో ఉంటే వ్యర్థ రహిత టౌన్‌షిప్‌గా మారుతుందన్నారు. ఎన్టీపీసీ సీనియర్ మేనేజర్ సరిత, అధికారులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం



కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో ప్రయాణ ప్రాంగణం నిరుపయోగంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు నిర్మించిన బస్టాండ్‌కు ప్రయాణికులు రాక శిథిలావస్థకు చేరుకుంది. ప్రయాణికులు రహదారిపైనే ఉండటంతో బస్సులు అక్కడే తిప్పుకొని వెళ్తున్నాయి. అధికారులు బస్టాండును ఉపయోగంలోకి తీసుకురావాలి. **- న్యూస్‌టుడే, కాల్వశ్రీరాంపూర్**

సమాధుల మధ్య ఆటలా!

యువత, విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు గత ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసింది. చాలా చోట్ల నిరుపయోగంగా, ఆటలాడేందుకు వీలులేకుండా చెరువుల్లో, చెత్తకుప్పల పక్కన ఉన్నాయి. పెద్దంపేటలో క్రీడా ప్రాంగణాన్ని శ్మశానవాటిక వద్ద ఏర్పాటు చేశారు. మట్టికుప్పలతో ఆటలాడే వీలులేక పరికరాలు తుప్పు పట్టిపోతున్నాయి. **-న్యూస్‌టుడే, కాల్వశ్రీరాంపూర్**



మార్కెట్ రహదారికి మోక్షమెన్నడో...



గోదావరిఖని లోని నగరపాలక మార్కెట్ ప్రధాన రహదారి గోతులు, బురదమయం కావడంతో వ్యాపారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శివాజీనగర్ ప్రధాన మురుగు కాలువ నుంచి చికెన్ మార్కెట్ మీదుగా హోల్‌సేల్, టోకు దుకాణాల వరకు మార్కెట్ చుట్టూ రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికులతో పాటు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.
- న్యూస్‌టుడే, గోదావరిఖని పట్టణం

కచ్చా కాలువలు.. మురుగు నిల్వలు

సుల్తానాబాద్‌లోని స్వప్నకాలనీలో కాలువలు లేక ఇళ్లలోంచి వెలువడే మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. కచ్చా కాలువల చుట్టూ గడ్డి పెరిగి.. మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది. దీంతో రాత్రిళ్లు దోమల బెడద తీవ్రమై జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. పురపాలిక అధికారులు కాలువల నిర్మాణం చేపట్టి మురుగును దూర ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, సుల్తానాబాద్ గ్రామీణం



మురుగు నిలిచి.. తటాకాలను తలపించి

● శాశ్వత చర్యలు శూన్యం

న్యూస్‌టుడే, పెద్దపల్లి

నివాస గృహాల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు మురుగు నిల్వల కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాకాలంలో వరదనీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. వీటి కారణంగా కాలనీల్లో దోమలు ఎక్కువగా వ్యాప్తి చెందుతున్నాయి. మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడం.. రోడ్డు వేసి, కాలువలు నిర్మించకపోవడంతో జిల్లా కేంద్రంలో ఈ పరిస్థితి నెలకొంది.

కొత్తగా వెలిసే కాలనీల్లో ఎక్కువ

శాంతినగర్ నుంచి లక్ష్మీనగర్, రంగంపల్లి వరకు వరదనీరు ఎటు వెళ్లాలేని పరిస్థితి ఉంది. కొత్తగా వెలిసే కాలనీల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. శాంతినగర్, ఐటీఐ కాలనీ, టీచర్స్‌కాలనీ, శివపురి కాలనీలలో రైల్వే ట్రాక్ కింద నుంచి బయటకు నీరు వెళ్లే కాలువలు లేకపోవడం.. ఉన్నా ఒకట్రెండు ప్రాంతాల్లో పూడిక చేరడం సమస్య తీవ్రతకు కారణమవుతోంది.

పదేళ్లుగా సమస్య

● జిల్లా కేంద్రంలోని రాజీవ్ రహదారికి ఇరువైపులా గతంలోనే మురుగు కాలువలు నిర్మించారు. ● కాని ఆ వ్యర్థపునీరుకు గమ్యస్థానం లేకపోవడంతో దుకాణాల నిర్వాహకులు కాలువలో మట్టి పోస్తున్నారు. ● సమస్య తీవ్రమైనప్పుడు పూడిక తీస్తున్నారే తప్పితే.. గడిచిన పదేళ్లుగా పురపాలిక ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ● హైవేకు దిగువన నిర్మించిన కల్వర్టుల నిర్వాహణ సరిగా లేక ఉదయనగర్ ప్రాంతంలో భారీ వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపైకి నీరొస్తుంది. ఇదే పరిస్థితి బస్టాండ్ ప్రాంతంలో కూడా ఉంది. బస్టాండ్ సమీపంలోని ఊట వాగు ఆక్రమణకు గురికావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ● కాలనీల్లో, ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిస్తే మోటార్లు పెట్టి తోడడం మినహా శాశ్వత పరిష్కారం దిశగా పురపాలిక అధికారులు చర్యలు చేపట్టడం లేదు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నట్లు కమిషనర్ వెంకటేశ్ న్యూస్‌టుడేతో అన్నారు.


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీటిని మోటార్‌తో తొలగిస్తున్న దృశ్యం

మైసమ్మను దర్శించుకున్న మంత్రి


మైసమ్మను దర్శించుకుంటున్న మంత్రి శ్రీధర్‌బాబు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): రామగిరి మండలం సెంటినరీకాలనీలోని మైసమ్మ అమ్మవారిని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం దర్శించుకున్నారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. నాగేపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతియాదవ్, సర్పంచులు మహేశ్, దివ్య, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు రామ్మూర్తి తదితరులు ఉన్నారు.

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ): మంత్రి శ్రీధర్‌బాబును సెంటినరీకాలనీలో ఉద్యమకారులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుపై రచించిన పాటలను ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూనె రాజేశం అందజేశారు.

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: వెంకట్రావుపల్లి మాజీ ఎంపీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ కుటుంబసభ్యులను మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్‌గౌడ్ తల్లి లక్ష్మి ఇటీవల మృతిచెందగా ఆమె చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

అసంపూర్తి నిర్మాణం.. ప్రమాదాలకు కారణం

పెద్దపల్లి-జూలపల్లి ప్రధాన రహదారి నిర్మాణం ఇంకా పూర్తవలేదు. పెద్దపల్లి నుంచి కాచాపూర్ వరకు రూ.18 కోట్లు, కాచాపూర్ నుంచి జూలపల్లి వరకు రూ.14 కోట్ల చొప్పున రెండు భాగాలుగా విభజించి ఈ పనులు చేపట్టారు. కాచాపూర్-జూలపల్లి మధ్య రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రహదారిని విస్తరించి కంకర వేసి వదిలేశారు. పనులు పూర్తవకపోవడంతో మండల ప్రజలకు 'నడక'యాతన తప్పడం లేదు. జూలపల్లిలో అంబేడ్కర్ కూడలి వద్ద, మండల కార్యాలయాలకు చేరే మార్గంలో కంకరతో అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలు లేనప్పుడు దుమ్ములేస్తోంది. అక్కడక్కడా కంకర తేలి ఆటోలు, బైకుల రాకపోకలకూ అసౌకర్యంగా మారింది. రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని ప్రజలు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, జూలపల్లి(ధర్మారం)**



వానొస్తే రాకపోకలు నిలిచిపోవాల్సిందే



జూలపల్లి నుంచి చొప్పదండికి వెళ్లే ప్రధాన రహదారిలో జూలపల్లిలో హుస్సేన్‌మియా వాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులకు ముందడుగు పడటం లేదు. రూ.5 కోట్లు మంజూరవగా, గతేడాది మే 21న ప్రభుత్వ విప్ విజయరమణారావు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఇప్పటికీ పనులు మొదలవలేదు. పెద్దపల్లి, ధర్మారం మండలాల నుంచి వచ్చే వాహనదారులు ఈ మార్గంలోనే చొప్పదండికి వెళ్తారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వంతెన పైనుంచి వరద పారుతుంది. రాకపోకలు నిలిచిపోతాయి. అధికారులు స్పందించి వంతెన నిర్మిస్తే మండలవాసులకు అసౌకర్యం తొలగనుంది. **- న్యూస్‌టుడే, జూలపల్లి(ధర్మారం)**

పదోన్నతిపై వెళ్తున్న జడ్జిలకు సత్కారం

గోదావరిఖని, న్యూస్‌టుడే: పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న గోదావరిఖని జడ్జి శ్రీనిజ కోహిర్కర్‌ను బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. శనివారం రాత్రి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన శ్రీనిజ కోహిర్కర్ సీనియర్ జడ్జిగా పదోన్నతి పొంది పెద్దపల్లికి బదిలీ అయ్యారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు అమరేందర్‌రావు, సత్యనారాయణ, కుమార్, అంజలి, రవీందర్, ప్రసన్న, శ్రీనివాస్, రాజయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం : నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి పొంది జగిత్యాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీగా బదిలీపై వెళ్తున్న మట్ట సరితను ఆదివారం అడ్వొకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొట్ల లక్ష్మీనర్సయ్య, సీనియర్ న్యాయవాదులు ఆకారి రాజేశం, నూనె సత్యనారాయణ, భీమారపు సంపత్, నార అశోక్‌రెడ్డి, రావుల రజిత, ధర్మపురి న్యాయవాదులు, ఇన్‌చార్జి ఏజీపీ ఉప్పు రాజు పాల్గొన్నారు.


గోదావరిఖని : జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు


ధర్మారంలో..

సింగరేణిలో క్రీడల నిర్వహణకు రూ.1.35 కోట్లు

యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే: నూతన క్రీడా సంవత్సరానికి సింగరేణి యాజమాన్యం క్రీడాక్యాలెండర్‌ను విడుదల చేసింది. సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో కార్మికులకు క్రీడాపోటీలు నిర్వహించేందుకు రూ.1.35 కోట్ల నిధులు కేటాయించింది. సెప్టెంబరు నుంచి నవంబరు చివరి వారం వరకు 15 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది.

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణిలో వెంటనే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని తెబొగకాసం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్ర కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు లేఖ రాశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు 2023, డిసెంబరు 27న నిర్వహించారని, అదే రోజు ఫలితాలు ప్రకటించారన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలకు 2024, సెప్టెంబరు 9న అధికారిక పత్రాలు ఇచ్చారని వివరించారు. దీని ప్రకారం రెండేళ్ల కాలపరిమితి ముగియడానికి పది రోజులు మిగిలి ఉందన్నారు. పదవీ కాలం పూర్తి కాగానే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటి వరకు అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని నాయకులు ఎం.రాజిరెడ్డి, టి.రాజారెడ్డి కోరారు.

జీడీకే-11 గనిలో కూలిన పైకప్పు

గోదావరిఖని, న్యూస్‌టుడే: జీడీకే-11 గనిలో ఆదివారం రెండో షిఫ్టులో పైకప్పు కూలింది. ఒకటో సీంలోని కంటిన్యూస్‌మైనర్ యంత్రంపైన భారీ మొత్తంలో బొగ్గు పేరుకుపోవడంతో అందులోనే కూరుకుపోయింది. పైకప్పు కూలిన సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. యంత్రాన్ని బయటకు తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పేద కుటుంబాలకు నిత్యావసర సరకుల అందజేత

కమాన్‌పూర్, న్యూస్‌టుడే: మండలంలోని పలు పేద, బాధిత కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనాల వెంకటస్వామి తరఫున ఆదివారం నిత్యావసర సరకులు అందజేశారు. నాగారం గ్రామ పంచాయతీ పరిధికి చెందిన వొడ్నాల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులతో పాటు రూ.2 వేల ఆర్థిక సాయం అందించారు. కమాన్‌పూర్ పరిధి రామ్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి రామయల్లు అనారోగ్యంతో మృతి చెందగా పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. హనుమాన్‌నగర్‌కు చెందిన మల్యాల లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. నాగారం సర్పంచి కుమార్, ఉపసర్పంచి శ్రీనివాస్, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలపై లైంగిక దాడులు

● పోలీసుల అదుపులో నిందితుడు

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకొని లైంగిక దాడులకు పాల్పడుతున్న వ్యక్తిని గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళలకు సాయం నెపంతో ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడుతుంటాడు. గతంలో గోదావరిఖని, ఎన్టీపీసీ పోలీసుస్టేషన్‌ల పరిధిలో మహిళలు, యువతులపై లైంగిక దాడికి సంబంధించి నాలుగు కేసుల వరకు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే శుక్రవారం ఫైవింక్లయిన్ బస్టాప్ వద్ద వేచి ఉన్న మహిళను మాటల్లో పెట్టాడు. బస్సులు లేక ఎదురు చూస్తున్న ఆమె అతని మాటలు నమ్మి ద్విచక్ర వాహనంపై వెళ్లింది. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిందితుడు చెట్ల పొదల్లోకి బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా సంఘటనా స్థలంలో దొరికిన చరవాణి ఆధారంగా నిందితుడిని గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులు నిందితునిపై పీడీ చట్టం అమలు చేసేందుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం సోమవారం అరెస్టు చేసే అవకాశం ఉంది.

ప్రయాణ ప్రాంగణం.. దోమలకు ఆవాసం



ధర్మారం ప్రయాణ ప్రాంగణం దోమలకు నిలయంగా మారింది. రోజూ 5 వేలమందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ ప్రాంగణం ఆవరణలో పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. దోమలు కుడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నామని బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని ఇళ్లు, దుకాణాలున్నవారూ ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు తాగునీటి కూలర్ వద్ద అపరిశుభ్రత నెలకొంది. ఆర్టీసీ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మారం**

సంక్షిప్తం

■ **పంచాయతీరాజ్ ఏఈకి సన్మానం**

ఎలిగేడు, న్యూస్‌టుడే: మండల పంచాయతీరాజ్ శాఖ సహాయక ఇంజినీర్ రవీంద్రనాథ్ ఉద్యోగ విరమణ సందర్భంగా మండలంలోని సర్పంచులు ఆయనను సన్మానించారు. సర్పంచులు కప్పల ప్రవీణ్, సిద్ధి తిరుపతి యాదవ్, ఏలేటి వెంకట్ రెడ్డి, మద్దెల రమాదేవి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

■ **బాల్య వివాహాలను నియంత్రించాలి**

పెద్దపల్లి కలెక్టరేట్ : బాల్య వివాహాలతో అనేక అనర్థాలు ఎదురవుతున్నాయని, వాటిని నియంత్రించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బాలల సంరక్షణ కమిటీ సభ్యుడు అశోక్ తెలిపారు. గాయత్రి విద్యానికేతన్‌లో ఆదివారం బాల్య వివాహాల నివారణపై రూపొందించిన గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో మహిళలను అట్టడుగు స్థాయిలో ఉంచేందుకు బాల్యవివాహాలు దోహదం చేస్తున్నాయని తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల ఛైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్ రజనీ, ప్రిన్సిపల్ విజయ్ పాల్గొన్నారు.

■ **రైస్‌మిల్లు కార్మిక సంక్షేమ సంఘం కార్యవర్గం**

సుల్తానాబాద్ గ్రామీణం : సుల్తానాబాద్ రైస్‌మిల్లు కార్మిక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బాబర్ సలీం పాషా, అధ్యక్షుడిగా శంకర్ ఎన్నికయ్యారు.

■ **యువతి వివాహానికి ఆర్థిక సాయం**

పాలకుర్తి(అంతర్గాం): అంతర్గాం మండలం టీటీఎస్ అంతర్గాం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన సందిపేట భారతి-సంతోశ్ కుమార్తె వివాహానికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ట్రస్టు ఛైర్మన్, సర్పంచి రవికుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, ట్రస్టు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

■ **భాజపా కార్మిక విభాగ కన్వీనర్ నియామకం**


నర్సయ్య

గోదావరిఖని, న్యూస్‌టుడే: భాజపా కార్మిక విభాగం జిల్లా కన్వీనర్‌గా గోదావరిఖనికి చెందిన నర్సయ్యను నియమిస్తూ రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ శ్రీనివాస్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని భాజపా జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి ద్వారా తీసుకున్నారు.

■ **ప్రచార ప్రతి విడుదల**


ప్రచార ప్రతిని విడుదల చేస్తున్న ప్రతినిధులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య సినిమా ప్రచార ప్రతిని ఆదివారం గోదావరిఖనిలో విడుదల చేశారు. సినీ సహ నిర్మాత రాజిరెడ్డి, శంకర్‌గౌడ్, నిర్మాణ కమిటీ సలహాదారుడు బలయ్య, గౌరవ అధ్యక్షులు శంకరయ్య, రాజిరెడ్డి, మల్లేశ్, సాంబయ్య, మల్లయ్య, భారతి, లక్ష్మి, రజిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

■ **నర్సింహులపల్లిలో వైద్య శిబిరం**

ధర్మారం, న్యూస్‌టుడే: నర్సింహులపల్లిలో ఆదివారం కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలు, రక్తపోటు, మధుమేహం, వివిధ సమస్యలకు చికిత్సలు అందించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. సర్పంచి మల్లయ్య, డా.సుజిత్‌కుమార్, ఆసుపత్రి నిర్వాహకుడు కిరణ్‌కుమార్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని భాజపా డిమాండ్


నిరసన తెలుపుతున్న భాజపా నాయకులు

గోదావరిఖని, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని భాజపా నాయకులు డిమాండ్ చేశారు. భాజపా నాయకురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో ప్రశ్నిస్తున్న రామగుండం పేరుతో ఆదివారం గోదావరిఖనిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. భాజపా డిమాండ్ ప్రతిని విడుదల చేశారు. అరుణ్‌కుమార్, లక్ష్మీనర్సయ్య, రామన్న, రాజేశ్, రేణుక, శ్రీనివాస్, పవన్ సత్యం, రంజిత్, విశ్వాస్, భారతి, సతీశ్, స్వామి, రజిత, రాజేశ్, శ్రావణ్ తదితరులున్నారు.